REGD. NO. 40 A. విడి ప్రతి 13 నయాపైసలు 21-6-57 శుక్రవారం

# జమీన్ రైతు

సంపుటి 29 : మేనేజింగుఎడిటర్ : నెల్లూరు వెంకట్రామానాయుడు :: సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి : సంచిక 25

## హైదరాబాద్ లేఖ

★ ★ ★ మా విలేకరి ★ ★ ★

రాజకీయంగాను, పరిపాలనా దృష్టితోను గత వారం పదిరోజులనుంచి ఆంధ్రప్రదేశ్ రాజధానిలో వ్యవహారాలు అతి స్తబ్దతగా గడచిపోతున్నాయి. పోలీసుచర్య జరిగి, కమ్యూనిస్టుల ఆరాచకచర్యలు ముగిసి, ప్రథమ సాధారణ యెన్నికలు జరిగి, బూర్గుల రామకృష్ణారావుగారి మంత్రివర్గం ఏర్పడిన రెండు సంవత్సరాలదాకా ఇక్కడ రాజకీయ జ్వరం తీవ్రంగానే ఉండేది. ఆ తరువాత స్వామీ రామానందతీర్థను హైదరాబాదు ప్రదేశ కాంగ్రెసురంగంనుంచి నిష్క్రమింపజేసిన అనంతరం, ఆంధ్రప్రదేశ్ ఏర్పడేటంతటివరకు, ఒక విశాలాంధ్రస్థాపన విషయంలో తప్ప, ఇక్కడ యెప్పుడూ స్తబ్దతే వుంటూవచ్చింది. నిజామాబాద్‌లో గత ఏప్రెలులో సమైక్య తెలుగు రాష్ట్రాన్ని ఏర్పరచుటకే భారత ప్రభుత్వం నిశ్చయించిందని ప్రధాని నెహ్రూ ప్రకటించడంతో, మళ్ళీ స్తబ్దత ఏర్పడింది. విశాలాంధ్ర ఏర్పడిన తరువాతకూడా మన రాజకీయ వ్యవహారాల్లో ఇంత నిస్సారం, చైతన్యరాహిత్యం వుండడంచే, ఆంధ్రరాజకీయ వాదులకు, హైదరాబాదునగరం నీరు బాగా వంటపట్టిందన్నమాట.

★

పరిపాలనా వ్యవహారంలో స్తబ్దతకు చాలా కారణాలు వున్నాయి. ముఖ్యమంత్రిగారు స్నానాల గదిలో జారిపడడంతో భుజానికి గట్టి దెబ్బతగిలి, పదిహేను ఇరవై రోజులు విశ్రాంతి తీసుకోవాలని డాక్టర్లుసలహా ఇచ్చినందున, ఆయన కార్యక్రమాలన్నింటినీ రద్దు చేశారు. ఈ పదిహేను రోజులూ ఆయన సెక్రెటేరియట్‌కి రాలేదు. ప్రతి గురువారం జరిగే ఆయన పత్రికా గోష్ఠికూడా జరగలేదు. నగరంలో ఆయన పాల్గొనవలసిన సభలు సమావేశాలు వాయిదా వేయడమో, మరొకరిచేత జరిపించడమో జరిగింది. ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం. పి. పాయ్ తల్లిమృతి కారణంగా సెలవు పెట్టిమంగుళూరు వెళ్ళిపోయారు. దాదాపు మంత్రులందరూ ఏదో పర్యటన పైపోతువస్తూనే వున్నారు. శీతజ్వరంఅంటూ లేంపాలే, ఆర్థికమంత్రి, రహదార్ల మంత్రి కోస్తాజిల్లాల పర్యటన విరమించుకునే వారేకాదు. ఆంతరంగిక వ్యవహారాలమంత్రి దాదాపు 25 రోజుల పర్యటన కార్యక్రమం వేసుకొని వెళ్ళిపోయారు. శీతజ్వరంకాని, కృష్ణా పుష్కరాల కారణంగా — ప్రయాణాలపై నిర్బంధాలు కాని, విద్యామంత్రి, స్థానిక పరిపాలనమంత్రి విస్తృత పర్యటనలకు ఏమాత్రం ఆటంకం కలిగించలేక పోయినవి. ప్రజలను, ముఖ్యంగా తమ జిల్లా ప్రజలను సన్నిహితంగావుండి, వారికి కొత్త విద్యాలయాలలో లేక కొత్త పై తరగతులలో, లేక భవనాలలో మంజూర్లుఇచ్చి, ప్రారంభోత్సవాలు చేసి, వారి మన్ననలను, సన్మానాలను పొందడానికి ఈ రోజులే తగినవి. వాటి నెలా జారవిడుచుకోగలరని కనుక, ఇద్దరు దాదాపు ఒకే కార్యక్రమాన్ని (వేర్వేరుగానే) వేసుకొని బయల్దేరివెళ్ళారు. ఇంకొక వారం రోజులదాకా బహుశా తిరిగిరారు. ఇంతకుముందు పత్తికొండ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం పేరుతో అందరూ అక్కడ తేలా

# 'నోటిలో నాల్క లేని' శ్రీ నరోత్తమరెడ్డిగారే ఏకీకృత ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షులా?

వారంరోజులు గడిపివచ్చారు. (ఆయినా పత్తికొండ దక్కలేదు. కమ్యూనిస్టుల సహాయంతో గెలిచిన అభ్యర్థి పెద్ద జమీందారు, ధనికుడు అయినప్పటికీ అది కాంగ్రెసుకు దక్కలేదు. అదంతా వేరేవిషయం.) మంత్రుల ఈ ధోరణి చూసో, మాదిరినో రవెన్యూ బోర్డు సభ్యులుముగ్గురు (మొత్తంఐదుగురు) నెలనుంచి రెండు నెలలదాకా సెలవులు తీసుకొని వెళ్ళిపోయినారు. ఈ పదిహేను రోజులలో మంత్రి వర్గ సమావేశంకూడా జరగలేదు. (వచ్చేవారం జరుగుతుందని అనుకుంటున్నారు). ఇక పాలనలో ఒక రకమైన స్తబ్దత ఏర్పడిందంటే ఆశ్చర్యమేముంది?

★

రాజకీయ స్తబ్దతకుకూడా కారణాలు వెదుక్కోనక్కర్లేదనుకుంటాను. ఉభయ ప్రదేశ కాంగ్రెసు సంఘాలు విలయినంత త్వరగా సమైక్యం చెందాలని నిర్ణయం చేసిన తరువాత యిక యీసంఘాలకు కార్యక్రమమంటూ ఏమి వుంటుంది? గాంధీభవనంలో హైదరాబాదు ప్రదేశ్ కాంగ్రెసు సంఘ కార్యాలయానికి పోస్టాఫీసుపని మాత్రమే మిగిలింది. ఢిల్లీనుంచి వచ్చిన సర్క్యులర్లను, తాకీదులను, దిగువ సంఘాలకు నకళ్లు తీసి పంపించేపనిని కార్యాలయ సిబ్బంది ఏ అధ్యక్ష, కార్యదర్శుల సహాయం అవసరం లేకుండానే చేయగలరు. కాబట్టి పదవు మహాశయులు గాంధీ భవనంలో కనపడకపోవడం గగనమైపోయింది. ఆంధ్ర రత్న భవనంలో పరిస్థితి మరో విధంగా వుంటుందని ఊహించడం అనవసరమే ననుకుంటాను. ఆంధ్ర కాంగ్రెసు రాజకీయాల్లో ఇంతటి నిస్తబ్ధతకు మరొక కారణం కూడా లేక పోలేదు. పార్లమెంటు సభ్యులైన వారు ప్రదేశ్ కాంగ్రెస్‌లో పదవీబాధ్యతలు వహించకూడదని అఖిలభారత కాంగ్రెసువారి తీర్మానం, మన రాష్ట్రంలోని ఉభయ సంఘాల అధ్యక్షులకూ ముప్పు తెచ్చిపెట్టింది. వీరిలో ఒకరికి ఏవిధంగానైనా అధ్యక్షపదవి ఊడుతుంది. ఇక రెండవవారి భవిష్యత్తు ఒక ప్రశ్న. ఈయన, అంటే శ్రీ అల్లూరివారు, రాజ్యసభ సభ్యత్వం వదులుకొని పూర్తి కాలం కాంగ్రెస్ వ్యవస్థకు ఉపయోగపడేట్టుగా, అధ్యక్షుడుగా పనిచేయాలి. అలా ఎందుకోసం చేయాలన్న ప్రశ్న వస్తుంది. కాంగ్రెసు సంస్థను సచేతనంచేసి అటు ప్రభుత్వానికి, యిటు ప్రజలకు నూతన నాయకత్వం ఇవ్వగలిగేట్టు చేయాలంటే ముఖ్యమంత్రితో సంఘర్షణ తప్పదు. ఇప్పటికే, భూసంస్కరణలు, ఆహారధరలు మొదలైన సమస్యలపట్ల, ముఖ్యమంత్రి, వ్యవసాయమంత్రి ఒకరకంగా ఆలోచిస్తూంటే, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు మరోవిధంగా ఆలోచిస్తున్నారు. ఏదో విధంగా సద్దుకుపోదామనుకుంటే, "ప్రగతిశీల నాయకుడుగా" అటు కాంగ్రెస్ అగ్రనాయకుల్లోను, ఇటు రాష్ట్ర కాంగ్రెసు కార్యకర్తలు - ప్రజల్లోను తెచ్చుకుంటున్న పేరు అధిక కాలం శ్రీ అల్లూరికి నిలవక పోవచ్చును. ఈ దృష్టితో చూస్తే ఘర్షణకు యే మాత్రం అవకాశం ఇవ్వని "నోటిలో నాల్క లేని" శ్రీ నరోత్తమరెడ్డే ఏకీకృత ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షుడుగా ఉండాలని నీలం వారు భావించినా భావించవచ్చును.

—[illegible] 4వ పేజీలో

## సోమశిల పరిశీలనకు కేంద్రమంత్రి హాథీ 27 తేదీన వస్తున్నారు

సోమశిల; కావలి - కనుపూరు కాల్వల పరిశీలనకు కేంద్ర యిర్రిగేషన్ శాఖ ఉపమంత్రి శ్రీ జైసుఖ లాల్ హాథీగారు 27 తేది ఎక్స్‌ప్రెస్‌లో నెల్లూరు వస్తున్నారు. వారు 27 తేది భోజనానంతరం బయలుదేరి సోమశిలకుపోయి రాత్రి నెల్లూరుకు తిరిగివచ్చి, 28 వుదయం కనుపూరు చెరువు చూచి ఎక్స్‌ప్రెస్‌లో మద్రాసు పోదురు.

### రైతుల సమావేశం

హాథీ రాకసందర్భంలో సోమశిల విషయంలో వారికి సమర్పించవలసిన నివేదికనున్న విషయాలనుగూర్చి చర్చించుటకు 22-6-1957 తేది మధ్యాహ్నం 3 గంటలకు నెల్లూరు పురమందిరమున రైతుల సమావేశం జరుగునని, అందరూ పాల్గొనవలసిందిగా సోమశిల ప్రాజెక్టు రైతు సంఘ కార్యదర్శి శ్రీ వంగల్లు కోదండరామరెడ్డిగారు కోరుచున్నారు.


అనుభవించుటే ఆనందం!

* * * * * *

పట్టుచీరెలు - సిల్కుచీరెలు - పట్టు ఉత్తరీయాలు - సిల్కు ధోవతులు - ఇంగ్లీషు వాయిలు - స్విట్జర్లాండు వాయిల్ - షిఫాను చీరెలు - జపాను సిల్కు

నేత

చీరెలు - ధోవతులు - అన్నీ ధరలు చాల తక్కువ

Pure Khadi For Nice Shirting Available Here

భారతీమార్టు (P) లిమిటెడ్

హెడ్డాఫీస్: మద్రాస్.

Tel : 84

ట్రంకురోడ్డు, నెల్లూరు.

